# మధుర నాట్యం

గోవులను మేపుకుంటూ మధుర నుండి ఒక బృందం 150 సంవత్సరాల క్రితం ఊరు ఊరు తిరుగుతూ అదిలాబాదులోని అడవులలోకి వచ్చారు. ఆనాడు అక్కడి అడవిలో మేత, నీరు లేక చాలా ఆవులు చనిపోయాయి. అందువలన వారు తిరిగి వెళ్ళలేక ఆదిలాబాదు అడవులలోనే ఉండిపోయారు. వారిని మధుర బంజారా అని అంటారు. మధుర బంజారాలు మధుర నాట్యం చేస్తారు. శ్రీ కృష్ణులవారు గోపికలతో పాడేపాటలు వీరు పాడుకుంటూ చేసే నృత్యమే"మధుర నాట్యం" లేక "మాధురి నాట్యం" ఈ నాట్య బృందంలో 18 మంది నర్తకులు 2 నగారా వాయించేవారు ఉంటారు.



పంచె, పొడుగాటిచొక్కా చొక్కాపైన చిన్న కోటువేసుకొని ఒక చేతిలో కర్ర, ఇంకొకచేతిలో రుమాలా పెట్టుకొని నృత్యము చేస్తారు. ప్రధాన కళాకారునికి రెండుచేతులలో ఝుం ఝునా వాద్యాలు ఉంటాయి. దసరా, గోకులాష్టమి, నాగపంచమి, అమ్మవారి ఉత్సవాలలో దేవుని గుళ్లలో జరిగే ఉత్సవాలలో వీళ్లు ఈ కార్యక్రమాలు ఏర్పాటు చేస్తారు.

నిజాం పరిపాలనలో మంచి ఆదరణ ఉన్నట్లుగా చెబుతారు. ప్రస్తుతం వీరు కార్యక్రమాలు లేని రోజులలో అడవిలోని పళ్లు, పుల్లలు ఏరుకొని అమ్ముకోవడం, కూలి చేసుకోవడం చేస్తున్నారు.